ఊరికి రెండు బెల్టు షాపులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం ఏరులై పారుతోంది. కూటమి నేతల అండతో గ్రామంలో రెండు బెల్టు షాపులు పెట్టారు. రాత్రీపగలు తేడా లేకుండా విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నారు. మందుబాబులు ఎక్కడపడితే అక్కడ తాగి వీధుల్లోనే పడిపోతున్నారు. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్, పోలీసు అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో తమ ఇల్లు, శరీరాలు గుల్లవుతున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఎక్కడపడితే అక్కడ మద్య సేవనం
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న ఎక్సైజ్ అధికారులు
- నామ మాత్రంగా కేసులు నమోదు



కోడి పందేల స్థావరం వద్ద బస్తాలో మద్యం బాటిళ్లు (ఫైల్)



ఆటోలో మద్యం విక్రయిస్తున్న బెల్టు షాపుల వారు(ఫైల్)

చిల్లకూరు : కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన మద్యం పాలసీలో భాగంగా మద్యం షాపులను ప్రైవేట్ వ్యక్తులకు మంజూరు చేసింది. ఇందులో గూడూరు డివిజన్‌లోని గూడూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 20 దుకాణాలు, వాకాడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 17 దుకాణాలు ఏర్పాటుచేశారు. ఆయా దుకాణాల వారు కూటమి నేతల అండతో సిండికేట్‌గా మారి ఎమ్మార్పీపై అదనంగా విక్రయాలు చేపట్టడంతోపాటు బెల్టు షాపుల ఏర్పాటుకు సహకరిస్తున్నారు. ఈ క్రమంలో ప్రతి గ్రామంలోనూ రెండు బెల్టు షాపులు నిర్వహిస్తూ విచ్చల విడిగా మద్యం అమ్మకాలు కొనసాగిస్తున్నారు.

బెల్టు షాపులకు వేలం పాటలు

గతంలో బెల్టు దుకాణం నిర్వహించే వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించేవారు. కూటమి ప్రభుత్వంలో బెల్టు షాపులు పెట్టుకునేందుకు ఆ పార్టీ నేతలు వేలం పాటలు నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామాల్లో రెండు షాపులకు తగ్గకుండా ఏర్పాటుచేశారు. అలాగే మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూము లు కూడా పెడుతున్నారు. బెల్టు షాపు ల వారు ఎమ్మార్పీపై అదనంగా రూ.20 నుంచి రూ.30 వరకు అధికంగా విక్రయించుకుంటున్నారు. ఈ విషయంపై ఎవరైనా ఎక్సైజ్, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా వారు అటు వైపు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక వేళ దాడులు చేయాల్సి వస్తే నిర్వాహకులకు ముందుగానే సమాచారం ఇస్తున్నట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారం మద్యం దుకాణాల సిండికేట్ కనుసన్నల్లోనే జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

తూతూ మంత్రంగా కేసుల నమోదు

గూడూరు నియోజకవర్గంలో గూడూరు, వాకాడులో రెండు ఎక్సైజ్ స్టేషన్లు ఉన్నాయి. వీటి కింద ఐదు మండలాలతోపాటు ఒక మున్సిపాలిటీ ఉంది. ఆయా ఎక్సైజ్ స్టేషన్ల అధికారులు బెల్టు షాపులపై తూతూమంత్రంగా దాడులు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఎవరినైనా పట్టుకుంటే వారి వద్ద లెక్కకట్టినట్లు 9 నుంచి 11 మద్యం బాటిళ్లను చూపించడం విశేషం. గత ఐదు నెలలు కాలంలో గూడూరు స్టేషన్ పరిధిలో 43, వాకాడు స్టేషన్ పరిధిలో 33 కేసులు నమోదు చేశారు. ఇక పోలీసులు ఇప్పటి వరకు ఒక్క కేసు కూడా నమోదు చేసిన దాఖలాలు లేవు.



రోడ్డుపై పడి పోయిన మందుబాబు(ఫైల్)

గూడూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని దుకాణాలు	:	20
వాకాడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో దుకాణాలు	:	17
ఐదు నెలల్లో నమోదు చేసిన కేసులు		
గూడూరు పరిధిలో	:	43
వాకాడు పరిధిలో	:	33



బెల్టు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ అధికారులు(ఫైల్)

బెల్టు షాపులపై నిరంతర నిఘా

పల్లెల్లో బెల్టు షాపులు ఉన్నాయని తెలిసిన వెంటనే దాడులు చేస్తున్నాం. సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నాం. అలాగే గ్రామాల్లో ప్రత్యేక బృందాల ద్వారా నిరంతరం నిఘా ఏర్పాటు చేశాం. బెల్టు షాపులు లేకుండా చేసేందుకు కృషి చేస్తున్నాం.

– ఎస్కే కరీమా బేగం, ఎక్సైజ్ సీఐ, గూడూరు

క్లుప్తంగా

సచివాలయం తనిఖీ

సైదాపురం: మండలంలోని కొమ్మిపాడు గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో సమావేశమయ్యారు. సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని వీధులను పరిశీలించారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని స్థానికులకు సూచించారు. పంచాయతీల్లోని చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని సిబ్బందిని ఆదేశించారు.

విద్యాశాఖ భవనం ప్రారంభం

తడ: మండల కేంద్రమైన తడలో పానాసోనిక్ పరిశ్రమ అందించిన రూ.20 లక్షలతో నిర్మించిన మండల విద్యాశాఖ కార్యాలయ భవనాన్ని శుక్రవారం పరిశ్రమ ఎండీ సెంథిల్ కుమార్ ప్రారంభించారు. పానాసోనిక్ పరిశ్రమ యాజమాన్యానికి ఇన్‌చార్జ్ ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంఈవోలు సరస్వతి, మల్లికార్జునరావు ధన్యవాదాలు తెలిపారు. పానాసోనిక్ ఇప్పటికే పలు పాఠశాలలకు సహకారం అందించిందని, మరింత సహకారం అందించేందుకు సంసిద్ధత తెలపడం అభినందనీయమన్నారు.

ఖనిజ సంపదను తరలిస్తే కఠిన చర్యలు

సైదాపురం: అక్రమంగా ఖనిజ సంపద తరలిస్తే కఠినమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ క్రాంతి కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని గులించెర్ల గ్రామంలోని యార్డు నుంచి అక్రమంగా ఖనిజ సంపదను తరలిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. తమ సిబ్బందితో కలిసి దాడి చేసి జేసీబీ, ట్రిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



కామేశ్వరరావును సన్మానిస్తున్న అధికారులు

పెళ్లకూరు: ఉద్యోగంలో అంకితభావంతో పనిచేస్తే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా పనిచేస్తూ శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన పిల్లెల కామేశ్వరరావును ఘనంగా సన్మానించారు. శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ విధుల్లో అలసత్వం లేకుండా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రమీలారాణి, ఎంఈవో శంకరయ్య, సర్పంచులు శివకుమార్, నాగేంద్రరెడ్డి పాల్గొన్నారు.

కారును ఢీకొన్న లారీ

చిల్లకూరు : మండలంలోని వరగలి క్రాస్ రోడ్డు వద్ద శుక్రవా రం కారును లారీ ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసుల కథ నం మేరకు.. నెల్లూరుకు చెందిన ఒక కుటుంబం కారులో చెన్నై బయలుదేరారు. వరగలి క్రాస్ రోడ్డు వద్ద లారీ వేగంగా వచ్చిఢీకొంది. కారు డివైడర్ ఎక్కి ఆగిపోయింది. కారులో ఉన్న వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త సీవీరామన్



సీవీరామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న షార్ డైరెక్టర్, ఇతర శాస్త్రవేత్తలు

సూళ్లూరుపేట : భారతదేశానికి గర్వకారణమైన శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ 1928 ఫిబ్రవరి 28న తన ప్రఖ్యాత 'రామన్ ఎఫెక్ట్'ను కనుగొన్నారని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా షార్ కేంద్రంలోని బ్రహ్మప్రకాష్ హాల్‌లో శుక్రవారం షార్ శాస్త్రవేత్తలందరూ సర్ సీవీ రామన్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 28న రామన్ ఎఫెక్ట్‌ను కనుగొన్న సందర్భాన్ని పురస్కరించుకుని దేశంలో ప్రతి ఏటా ఫిబ్రవరి 28ని జాతీయ సైన్స్‌డేగా ప్రకటించారని తెలిపారు. కార్యక్రమంలో షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, ఇతర శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

కనుల పండువగా వసంతోత్సవం

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట స్వర్ణముఖి నది ఒడ్డున వెలసిన ప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ధర్మకర్త గూడూరు సుధీర్ రెడ్డి దంపతులు, శివ భక్తుల సారధ్యంలో వసంతోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులు, త్రిశూలాన్ని ఊరేగింపుగా స్వర్ణముఖి నది వద్దకు తీసుకువచ్చారు. అక్కడ విశేష పూజలు చేసి నదిలో స్నానం చేయించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. దీనికి ఉభయకర్తలుగా ఎంఈవో మునిరత్నం దంపతులు వ్యవహరించారు. రాత్రి పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను పూల రథంపై ప్రతిష్టించి నగరోత్సవం చేశారు.

వేడుకగా శివపార్వతుల కల్యాణం

ఓజిలి: మహాశివరాత్రి పర్వదినం వేడుకల్లో మూడో రోజు శుక్రవారం సగుటూరులోని శ్రీబాల అమృత మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయ మండపంలో తీసుకొచ్చి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. నాదెండ్ల వెంకటేశ్వర్లు, పుత్తూరు వేణయ్య దంపతులు ఉభయకర్తలుగా వ్యవహించారు. అడుసుమల్లి రవీంద్రనాయుడు అన్నదానం చేశారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ చైర్మన్ లెక్కల మల్లికార్జున, హైదరాబాద్‌కు చెందిన చెరుకూరు వరాహాల రాధాకృష్ణ, చిల్లకూరు దక్షిణామూర్తి పాల్గొన్నారు.

8న జాతీయ లోక్ అదాలత్

వెంకటగిరి రూరల్ : స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఈ నెల 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు జడ్జి అనూష తెలిపారు. ఆమె శుక్రవారం న్యాయవాదులు, పోలీసులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు బాజ్జి, మురళీకృష్ణ, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల అడ్డగింత



సాగరమాల రహదారి పనులను అడ్డుకుని ఆందోళన చేస్తున్న రైతులు

నాయుడుపేట టౌన్ : సాగరమాల జాతీయ రహదారిలో అండర్ పాస్ బ్రిడ్జిల వద్ద పొలాల్లోకి వెళ్లేందుకు సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం నరసారెడ్డి కండ్రిగ సమీపంలో సాగరమాల రోడ్డు పనులు చేస్తున్న లారీలను అడ్డుకుని నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ గతంలో రోడ్డుకు భూమి సేకరించే సమయంలో జిల్లా కలెక్టర్, సూళ్లూరుపేట ఆర్డీవో, తహసీల్దార్ తమకు ఇబ్బంది లేకుండా సర్వీసు రోడ్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు పొలాల మధ్యలో సుమారు 13 అడుగుల ఎత్తులో రోడ్డును నిర్మిస్తూ అడ్డుగా సిమెంట్ బారికేడ్లు పెడుతున్నారని తెలిపారు. రోడ్డుకు రెండు వైపులా పొలాలు ఉన్న రైతులు వ్యవసాయం చేయలేని పరిస్థితి నెలకొందని వాపోయారు. అండర్ పాస్ బ్రిడ్జిల నుంచి పొలాల వరకు సర్వీసు రోడ్డు నిర్మించాలని కోరారు. లేకుంటే రైతులందరం ఏకమై పనులు అడ్డుకుని పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. రైతు సంఘం నాయకులు జలదంకి వెంకటకృష్ణారెడ్డి, సన్నారెడ్డి హరినాథ్‌రెడ్డి, కామిరెడ్డి మధుసూదన్ రెడ్డి, జలదంకి ధనుంజయరెడ్డి, అన్నమేటి సుధాకర్, పాపాడి చంద్రారెడ్డి, అరసూరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

నాయుడుపేట టౌన్ : మండలంలోని అన్నమేడులో శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. చెన్నై శంకర నేత్రాలయ వైద్యులు 300 మందికి పైగా కంటి పరీక్షలు చేసినట్టు విశ్రాంత ఉపాధ్యాయుడు చిగురువాడ పద్మనాభం తెలిపారు. 70 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. వారికి ప్రత్యేక బస్సులో 2వ తేదీ నుంచి ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. 6వ తేదీ వరకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అమెరికాలో ఉన్న కాటంరెడ్డి ప్రసాద్ రెడ్డి, శోభారెడ్డి ఆర్థిక సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామానికి చెందిన దువ్వూరు కుమార స్వామి రెడ్డి, సన్నారెడ్డి విజయ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి

గూడూరు రూరల్ : మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్ కార్మికులను దశలవారీగా పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ నాయకులు కోరారు. వారు శుక్రవారం పారిశుద్ధ్య కార్మికులతో కలిసి గూడూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ ఆప్కాస్‌ను రద్దు చేయాలని నిర్ణయించడం తగదన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవో శిరీషకు వినతి పత్రం అందజేశారు. తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గోపీనాథ్, గౌరవ అధ్యక్షుడు జోగి శివకు మార్, నాయకులు బి.వి.రమణయ్య, అడపాల ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు వెంకటరమణ, పట్టణ కార్యదర్శి దారా కోటేశ్వరరావు, రాజేష్, గిరి, సంపూర్ణమ్మ, నారాయణమ్మ, పద్మమ్మ, పెంచలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ ఆలయ సమీపంలో మద్యం షాపు

సూళ్లూరుపేట : పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయ సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఆలయాలు, పాఠశాలల సమీపంలో మద్యం దుకాణాలు ఉండకూడదు. వీటిని కూటమి నేతలు పట్టించుకోవడం లేదు. చెంగాళమ్మ ఆలయ సమీపంలోనే మద్యం షాపుతోపాటు పర్మిట్ రూమ్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పైపులైను ఏర్పాటులో చేతివాటం

చిట్టమూరు: మండలంలోని రాఘవవారిపాళెం గ్రామానికి తాగునీరు అందించేందుకు ఆరూరు నుంచి వేసిన పైపులైన్ పనుల్లో కూటమి నేతలు చేతివాటం చూపారు. రాఘవవారిపాళెం గ్రామానికి తాగునీరు సరఫరా చేసేందుకు గతంలో గ్రామీణ నీటి సరఫరా పథకం కింద పైపులైన్‌కు రూ.1.90 లక్షలు, బోరు, మోటార్ కోసం రూ.1.75 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పనులను అధికార పార్టీ నాయకులు చేశారు. నీటిని సరఫరా చేసే సమయంలో పైపులు పగిలిపోతుండడంతో గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఐదు రోజుల క్రితం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నందకుమార్ పైపులైన్ లీకేజీలను పరిశీలించారు. ఆయన ఆదేశాల మేరకు ఏఈ మహేంద్ర శుక్రవారం కూలీలతో పైపులైన్ వేసిన ప్రాంతాల్లో తవ్వకాలు చేపట్టడంతో కొత్త పైపులు వేయకుండా పాత పైపులు వేసినట్టు తేలింది. దీనిపై ఏఈని వివరణ ఇస్తూ మీకు ఇష్టం వచ్చినట్టు రాసుకోండని అసహనం వ్యక్తం చేశారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

డక్కిలి : గిరిజనులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ మోపూరు శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని కందలవారిపల్లి గిరిజన కాలనీలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజనుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమస్యలు ఉంటే పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.

విద్యుత్ కనెక్షన్లు తొలగింపు

కోట: ఇటుక బట్టీల వద్ద నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న విద్యుత్ కనెక్షన్లను అధికారులు తొలగించారు. విద్యుత్‌శాఖ ఏఈ తేజ్‌క్రిష్ణ శుక్రవారం తిమ్మనాయుడుపాళెం, వెంకన్నపాళెం పరిసరాల్లో ఉన్న ఇటుక బట్టీలను తనిఖీ చేసి 15 మంది విద్యుత్ కనెక్షన్లు తొలగించి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

సుధీర్‌బాబు సేవలు మరువలేనివి

డక్కిలి : డక్కిలి తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ శుక్రవారం స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన సోమరాజుపల్లి సుధీర్‌బాబు సేవలు మరువలేనివని తహసీల్దార్ ఎం.శ్రీనివాసులు తెలిపారు. ఆయనను రెవెన్యూ సిబ్బంది, అధికారులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

వెంకటగిరి (సైదాపురం) : ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించనున్నట్టు కస్టోడియన్ కె.రవీంద్రబాబు తెలిపారు. ఆయన శుక్రవారం వెంకటగిరిలోని విశ్వోదయ ప్రభుత్వ జూనియర్ కళాశాల, గురుకుల జూనియర్ కళాశాల, బడిమల నాగయ్య జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. సుమారు 1,150 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రానికి రావాలన్నారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్టు

సైదాపురం: మండలంలోని అన్నంరాజుపల్లి శివారులో శుక్రవారం కోడి పందేలు ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు దాడి చేసి వారి నుంచి రూ.3,500 నగదు, రెండు కోళ్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్ట్

డక్కిలి : మండలంలోని దేవులపల్లిలో బెల్టు షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ శివశంకర్ తెలిపారు. ముందుగా అందిన సమాచారంతో శోకా నరసింహులు ఇంటిపై దాడి చేశామన్నారు. అతన్ని అరెస్టు చేసి 8 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

కోట: ఏవీకేఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో గతేడాది పదో తరగతిలో ప్రతిభ చూపిన 60 మంది విద్యార్థులకు శుక్రవారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అలాగే ఉత్తమ పీఈటీగా అవార్డును అందుకున్న వలీఅహ్మద్‌ను సన్మానించారు. విశ్రాంత హెచ్ఎం నెల్లూరు సుబ్రమణ్యం, హెచ్ఎం రమాదేవి, ఉదయభాస్కర్, నాగయ్య, ఆవులసుబ్బయ్య, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ

వాకాడు : స్థానిక అంబేడ్కర్ గురుకుల కళాశాల విద్యార్థులకు శుక్రవారం పరీక్ష సామగ్రిని సర్పంచి బండి వెంకటరత్నమ్మ వితరణ చేశారు. ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ పిల్లలు దాతల సహకారంతో విద్యలో రాణించాలని కోరారు. ప్రిన్సిపాల్ రామానుజాచార్యులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రవీంద్రబాబు పాల్గొన్నారు.

గూడూరు మండలానికి రూ.30 లక్షలు మంజూరు

గూడూరు రూరల్ : మండలంలోని గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరైనట్లు జెడ్పీటీసీ ఊటుకూరు యామిని, వైఎస్సార్ సీపీ నాయకుడు ఊటుకూరు మహేంద్రరెడ్డి తెలిపారు. నిధులు మంజూరు చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మకు కృతజ్ఞతలు తెలిపారు.

భువనగిరిపాళెంలో ప్రజాభిప్రాయ సేకరణ

ఓజిలి: గ్రావెల్, మెటల్ క్వారీపై శుక్రవారం భువనగిరిపాళెంలో ఆర్డీవో కిరణ్మయి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాజశేఖర్ ప్రజల అభిప్రాయాలు సేకరించారు. సర్వే నంబర్-1లోని 2 హెక్టార్లలో గ్రావెల్, రోడ్డు మెటల్ క్రషింగ్ క్వారీ కోసం అధికారులు టెండర్ పిలిచారు. దీన్ని సుజిత్ ఇన్‌ఫ్రా దక్కించుకుంది. ఈ నేపథ్యంలో గ్రామస్తుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. నాయుడుపేట సీఐ సంగమేశ్వర్‌రావు, ఎస్‌ఐ స్వప్న బందోబస్తు ఏర్పాటు చేశారు.

కంటైనర్ లారీ మీద పడి ఒకరి మృతి

పెళ్లకూరు: మండలంలోని టెంకాయతోపు వద్ద శుక్రవారం కంటైనర్ లారీ మీద పడడంతో బాతుల కాపరి చలంచర్ల రామయ్య(58) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. రాజమండ్రి నుంచి బెంగళూరు వెళుతున్న కంటైనర్ లారీ టెంకాయతోపు గ్రామం ఫ్లై ఓవర్ వద్ద ముందు వెళుతున్న లారీని ఢీకొని అదుపుతప్పి రోడ్డు పక్కన సైకిల్‌పై వెళ్తున్న రామయ్యపై బోల్తా పడింది. అతను అక్కడికక్కడే మృతి చెందాడు. నాయుడుపేట సీఐ సంగమేశ్వరరావు, ఎస్‌ఐ నాగరాజు పరిశీలించారు. మృతుడు నెల్లూరు జిల్లా కోవూరు మండలం వేగూరు రామాపురం గిరిజన కాలనీ చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా సీవీ రామన్ కళాశాల క్రీడోత్సవాలు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని సీవీ రామన్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం క్రీడోత్సవాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు క్రీడా జ్యోతితో ప్రధాన వీధుల్లో ర్యాలీ చేశారు. నాయుడుపేట రోటరీ క్లబ్ అధ్యక్షుడు పెసల జయరాజగోపాల్, వైఎస్సార్ సీపీ న్యాయ విభాగం నియోజవర్గ అధ్యక్షుడు చదలవాడ కుమార్, కళాశాల కరస్పాండెంట్లు ఖాదర్‌బాబు, పి.శ్రీనివాసులు రెడ్డి, ప్రిన్సిపాల్ గాదిరెడ్డి గోపి, ఏవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో క్రీడా పోటీలను నిర్వహించారు.

ప్రభుత్వాస్పత్రికి బెడ్ బహూకరణ



మల్టీ పర్పస్ బెడ్‌ను ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు అందజేస్తున్న దాత

సూళ్లూరుపేట : పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి సుమారు రూ.1.50 లక్షల విలువైన మల్టీ పర్పస్ బెడ్‌ను కోటపోలూరుకు చెందిన బద్దెపూడి మురళీ శుక్రవారం బహూకరించారు. ఆయన తండ్రి బద్దెపూడి పరంధామిరెడ్డి జ్ఞాపకార్థం బెడ్ అందజేసినట్టు మురళీ తెలిపారు. వారిని ఆస్పత్రి సూపరింటెండెంట్ రమేష్ అభినందించారు. కార్యక్రమంలో కిన్నెర గ్రాండ్ హోటల్ యజమాని బద్దెపూడి సునీల్ రెడ్డి, హనుమంతరావు, ఎద్దల రమేష్‌రెడ్డి, నారప్పరెడ్డి రాజేష్, మూగ దేవకుమార్, మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్సు ప్రదర్శనలు

కోట: స్థానిక ప్రగతి విద్యానికేతన్‌లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పలు నమూనాలను ప్రదర్శించారు. విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్ మాట్లాడుతూ సర్ సీవీ రామన్ ఆవిష్కరణలను వివరించారు. సైన్స్ రంగంలో నోబెల్ బహుమతి పొందిన మొదటి భారతీయుడు సీవీ రామన్ అని తెలిపారు. విద్యార్థుల ప్రయోగాలను పరిశీలించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

ఓజిలిలో..

ఓజిలి: మండలంలోని చిలమానుచేను, ఆర్మేనిపాడు ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు పలు సైన్స్ ప్రదర్శనలు చేపట్టారు. పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. హెచ్ఎంలు పి.అనసూయ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సైన్సుతో మానవాళికి మేలు

చిల్లకూరు : సాంకేతిక పరిజ్ఞానం మానవాళికి మంచి జరిగేలా ఉండాలని విశ్రాంత హెచ్ఎం సంపత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. చింతవరంలోని రేస్ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం జాతీయ సైన్సు దినోత్సవం నిర్వహించారు. సింహపురి జిందాల్ పవర్ ప్రాజెక్టు ప్లాంట్ హెడ్ సుల్తాన్ అహ్మద్ మన్సూరి, చింతవరం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం శివసుబ్రమణ్యం, మోమిడి ఆయుర్వేద వైద్యులు కలపాటి శేఖర్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల చైర్మన్ గుమ్మడి వెంకటసుబ్బయ్య, కరస్పాండెంట్ బాలచెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



కోట: ప్రగతిలో సైన్స్ దినోత్సవం

పరిశోధనలపై మక్కువ పెంచుకోవాలి

చిట్టమూరు : పరిశోధనలపై మక్కువ పెంచుకోవాలని మెట్టు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం పార్థసారధి పిలుపునిచ్చారు. పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్సు దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, సుబ్బయ్య, శంకరమ్మ, పద్మావతి పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకరశర్మ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.